రైల్వే అభివృద్ధి పనులు వర్చువల్‌గా ప్రారంభం

ప్రజాశక్తి - దొరవారిసత్రం, కుప్పం, యంత్రాంగం

ప్రధాని మోడీ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 544 రైల్వేస్టేషన్లు, 1500 అండర్ పాస్ వంతెనలను సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు.

కుప్పంలో

చెన్నయ్ సదరన్ రైల్వే డివిజన్ డిఆర్ఎం సింగ్ దొరవారి సత్రం మండలంలో మినుమలమూడి, గొల్లపాలెం, దొరవారి సత్రంలలో ఏర్పాటు చేసిన బ్రిడ్జిల నిర్మాణాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దొరవారి సత్రం పూలతోట అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవ సభకు మండల అధ్యక్షులు దువ్వూరు గోపాల్‌రెడ్డి, సర్పంచి అనిల్‌కుమార్, డాక్టర్ చైతన్య, ఎంఇఒ కృష్ణయ్య హాజరయ్యారు. బ్రిడ్జి లోపల విద్యుత్ సదుపాయం కల్పించాలని, వర్షాకాలం నీరు చేరకుండా చూడాలని దువ్వూరు గోపాల్‌రెడ్డి రైల్వే ఎఇని కోరారు. ఏకొల్లు ఉన్నత పాఠశాల, కస్తూర్బా గ్రాంధీ విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థినులకు ఎస్ఐ తిరుమలరావు ప్రోత్సాహక ప్రశంసాపత్రాలను అందజేశారు.

చిత్తూరు అర్బన్‌లో రైల్వేస్టేషన్ ఆధునీకరణకు రూ.14 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని చిత్తూరు అభివృద్ధివేదిక నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం గుంతకల్ డివిజన్ అధికారులకు వేదిక కార్యదర్శి చైతన్య, ఉపాధ్యక్షులు ఉదయభాస్కర్‌లు వినతిపత్రం సమర్పించారు. లిఫ్ట్, ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలని, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను చిత్తూరు వరకూ పొడిగించాలని, చిత్తూరు నుంచి కాట్పాడి వరకూ డబ్లింగ్ పనులు వెంటనే చేపట్టాలని కోరారు.



చిత్తూరులో..

గూడూరు రూరల్ పరిధిలోని దివిపాలెంలో రైల్వేఅండర్‌పాస్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. జీవిఎస్ శంకరయ్య పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. దివిపాలెం సర్పంచి నాగరాజు, రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భుజంగన్ పాల్గొన్నారు.

కుప్పంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. కుప్పం అభివృద్ధికి రైల్వేకీలకమని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి మునిరత్నం పాల్గొన్నారు.

భరత్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి

- కుప్పంకు హంద్రీనీవా సువర్ణాధ్యాయం
- రూ.535 కోట్లతో మరో రెండు రిజర్వాయర్లు
- శాంతిపురం సభలో సిఎం జగన్మోహన్‌రెడ్డి
- రామకుప్పంలో హంద్రీనీవా జలాలు విడుదల

హంద్రీనీవా జలాలకు జలహారతి పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి, అనంతరం స్విచ్ నొక్కి జలాలను విడుదల చేస్తున్న సిఎం

ప్రజాశక్తి - రామకుప్పం, శాంతిపురం

కొండలు, గుట్టలు దాటుకుని 672 కిలోమీటర్ల మేర శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా కుప్పం నియోజకవర్గానికి నీళ్లందించే ఈ గొప్ప కార్యక్రమం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిందేనని సిఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. భరత్‌ను ఎంఎల్ఎగా గెలిపిస్తే మంత్రిని చేసి మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈసారి గెలిపిస్తే రూ.535 కోట్లతో మరో రెండు రిజర్వాయర్ల నిర్మాణం చేపడతానన్నారు. కుప్పం నియోజకవర్గంలో సోమవారం రామకుప్పం, శాంతిపురం మండలాల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటన సాగింది. మరింత నీటి స్టోరేజి కోసం సాగు, తాగునీటి కష్టాలకు శాశ్వతంగా చెక్‌పెట్టేలా రూ.535 కోట్లతో మరో ఐదువేల ఎకరాలకు సాగునీరు అందించేలా రెండు కొత్త రిజర్వాయర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రామకుప్పంలో హంద్రీనీవా జలాలను విడుదల చేసిన అనంతరం శాంతిపురంలో గుండుశెట్టిపల్లె వద్ద బహిరంగసభలో ప్రసంగించారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 6,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 4.02 లక్షల మందికి తాగునీరు అందుతుందన్నారు. చంద్రబాబు హయాంలో కుప్పం బ్రాంచి కెనాల్ నిర్మాణం ప్రారంభదశలో తన వాళ్లకు కాంట్రాక్టులు కట్టబెట్టి అంచనాలు పెంచి తక్కువ డబ్బులు ఖర్చు పెట్టే పనులు మాత్రమే చేసి ఖజానాను దోచుకున్నారన్నారు. కుప్పంలో 87,941 కుటుంబాలు ఉంటే తన 58 నెలల పాలనలో 82,039 కుటుంబాలకు 93.29శాతం ప్రయోజనం అందించామన్నారు. కుప్పం నియోజకవర్గానికి ఎవరివల్ల మేలు జరిగిందో ఆలోచించాలని కోరారు. సొంత నియోజకవర్గమైన చంద్రగిరిలో ప్రజలు ఆయన్ను ఓడిస్తే, కుప్పానికి వచ్చి ధనబలంతో బీసీ సీటును కబ్జా చేసి నియంతలా కొనసాగుతున్నారన్నారు. 35 ఏళ్లు గెలిచిన కుప్పంలో కనీసం ఇల్లు కట్టుకోవాలనే ఆలోచన చంద్రబాబుకు రాకపోవడం దారుణమన్నారు. వంగవీటిరంగాను హత్య చేయించడం వల్లనే కాపులంతా చంద్రబాబును వర్గశత్రువుగా భావిస్తున్నారన్నారని విమర్శించారు. తన హయాంలో కుప్పానికి రెవెన్యూ డివిజన్, మున్సిపాలిటీ, పోలీసు సబ్ డివిజన్ ఇచ్చానన్నారు. ప్రతిపక్ష నాయకుని నియోజకవర్గమని చూడకుండా కుప్పానికి నీళ్లిచ్చి, సంక్షేమ పథకాలు అందించానన్నారు. ప్రతిష్టాత్మక వేలూరు మెడికల్ కాలేజీని చిత్తూరుకు రాకుండా అడ్డుకున్నది చంద్రబాబేనని అన్నారు. కుప్పం ప్రజలకు చంద్రబాబు చేసింది సున్నా అన్నారు.

కుప్పం నియోజకవర్గానికి నీరందించిందిలా..

కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో 68.466 కిమీ వద్ద క్రాస్ రెగ్యులేటర్ (రామకుప్పం మండలం రాజుపేట వద్ద) నుంచి మద్దికుంటచెరువు (2.91 ఎంసీఎఫ్‌టీ), నాగసముద్రం చెరువు (0.25 ఎంసీఎఫ్‌టీ), మనేంద్రం చెరువు (13.78 ఎంసీఎఫ్‌టీ), తొట్లచెరువు (33.02 ఎంసీఎప్‌టీ)లకు సీఎం జగన్ కష్ణాజలాలను విడుదల చేశారు. ఆ తర్వాత మిగతా 106 చెరువులకు కష్ణాజలాలను విడుదల చేయడంతో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 6,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 4.02 లక్షల మందికి తాగునీరు అందుతుందని జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

సిఎంకు ఘన స్వాగతం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం అమరావతి నుంచి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడనుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం 11.05 గంటలకు రామకుప్పం మండలం రాజుపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు వచ్చారు. డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, రాజంపేట, చిత్తూరు ఎంపిలు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎన్.రెడ్డెప్ప, ఎంఎల్‌సిలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్, కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఎస్‌పి జాషువా పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

మరో రెండు రిజర్వాయర్లకు శంకుస్థాపన

గుడిపల్లి మండలంలోని యామగానిపల్లి వద్ద ఓ రిజర్వాయర్‌ను, శాంతిపురం మండలం మాదనపల్లి వద్ద మరో రిజర్వాయర్‌ను రూ.535 కోట్లతో నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. వీటి నిర్మాణం పూర్తయితే మరో ఐదువేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పాలారు ప్రాజెక్టుకు సంబంధించి 0.6 టిఎంసిల కెపాసిటీతో చిన్నపాటి రిజర్వాయర్‌ను రూ.215 కోట్లతో కట్టడానికి పరిపాలనా అనుమతులు ఇచ్చామన్నారు. మళ్లీ సిఎంగా గెలుపొందాక ఈ మూడు ప్రాజెక్టులను పూర్తి చేస్తానన్నారు.

భరత్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తా

ఎంఎల్‌సి భరత్‌ను కుప్పం ఎంఎల్ఎగా ఎన్నుకోండి.. ఎంఎల్‌సిగా ఉండే ఎంతో చేశారు. ఎంఎల్ఎగా మీరు గెలిపిస్తే తన క్యాబినెట్‌లో మంత్రిని చేస్తానని, తద్వారా కుప్పంకు మరింత అభివృద్ధి, సంక్షేమం చేస్తానన్నారు. రంగురంగుల మానిఫెస్టోలు చూసి మోసపోవద్దని, ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజికారు కొనిస్తానంటాడని ఎద్దేవా చేశారు.

సాదర వీడ్కోలు

రేణిగుంట : చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు లభించింది. సాయంత్రం 4.09 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి తిరుగు ప్రయాణమయ్యారు. కలెక్టర్ లక్ష్మీశ, సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్, ఎస్‌పి మలిక గర్గ్, కమిషనర్ అదితి సింగ్, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపి గురుమూర్తి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎంఎల్ఎలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి , శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ అంజూరి శ్రీనివాసులు, ఈఓ శ్రీకాళహస్తి నాగేశ్వర్ రావు, ఆర్డీఓ శ్రీకాళహస్తి రవిశంకర్ రెడ్డి ఉన్నారు.

సీఎం జగన్ సభకు తరలివెళ్లిన వైసీపీ నాయకులు

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కుప్పం సభకు మండలంలోని కత్తెరపల్లి పంచాయతీ వైసీపీ నాయకులు చంద్రగిరి పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బస్సులో బయలుదేరారు. అదేవిధంగా సిడి కండిగా కొల్లగుంట పంచాయతీల నుండి వైసీపీ నాయకులు ఆకుల గోపిమునికృష్ణ, ఎంపీటీసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బయలుదేరారు. కార్వేటినగరం ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనుంజయవర్మ, ధనశేఖర్ వర్మ, మండల కో ఆప్షన్ నెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, శోభన్ బాబు, అర్జునయ్య పాల్గొన్నారు.

సిఎంను కలిసిన పుత్తూరు ధనుంజయ రెడ్డి

వెదురుకుప్పం: సీఎం కుప్పం పర్యటనలో భాగంగా సోమవారం శాంతిపురం హెలీప్యాడ్ వద్ద సీఎం జగన్ మోహన్ రెడ్డిని మండలం వైఎస్ఆర్సిపి జిల్లా కోశాధికారి పుత్తూరు ధనుంజయరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ సిఎంను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

సీఎంని కలిసిన కేజే కుమార్ దంపతులు

రాష్ట్ర వైఎస్సార్సీపి ట్రేడ్ యూనియన్ సెక్రెటరీ కెజె.కుమార్, రాష్ట్ర బిసి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కెజె.శాంతి దంపతులు రేణిగుంట విమానాశ్రయానిలో సిఎం జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. సిఎంకు ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అలాగే బైరెడ్డిపల్లి ఎంపిపి మొగసాల రెడ్డప్ప కుప్పంకు విచ్చేసిన సిఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

సిఎంను కలిసి ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.మధుజ్యోతి

ముఖ్యమంత్రికి శివరాత్రి ఉత్సవాల ఆహ్వానం

శ్రీకాళహస్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వచ్చేనెల మూడో తేదీ నుంచి అంగరంగ వైభవంగా జరగబోయే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కుప్పం పర్యటన నిమిత్తం సీఎం జగన్ సోమవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న ఆలయ అధికారులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సీఎంకు ఆహ్వాన పత్రికలు అందజేసి శివరాత్రి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు.

హోరెత్తిన అసమ్మతి గళం

- దొంగ, స్మగ్లర్‌ను అభ్యర్థిగా ప్రకటిస్తే ఓటు వేయాలా?
- అధిష్టానాన్ని ప్రశ్నించిన స్థానిక టీడీపీ నేతలు
- నగరి టీడీపీ అభ్యర్థిగా గాలి భానుప్రకాష్ ఎంపికపై ఆగ్రహం

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, తెలుగు మహిళలు

ప్రజాశక్తి- నగరి : టీడీపీ అధిష్టానం నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా గాలి భానుప్రకాష్‌ను ప్రకటించడంపై స్థానిక టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పరిధి 1వ వార్డులో టీడీపీ సీనియర్ నాయకుడు, రామానుజం చలపతి, మాజీ కౌన్సిలర్ లత స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి అదిష్టానం వైఖరిని వ్యతిరేఖిస్తూ గ్రామదేవత సామాలమ్మ ఆలయ ఆవరణలో చంద్రబాబు, లోకేష్ ఫోటోలతో పాటు ఇసుక, గ్రావెల్, బియ్యం, గంజాయిని తలిపించేలా ఆకులు, ఎర్రచందనం కట్టలు పట్టుకొని విన్నూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. గంజాయి స్మగ్లర్లు, గ్రావెల్, బియ్యం స్మగ్లర్లు, లిక్కర్ స్మగ్లరు, కంకర దొంగలు, చందనం స్మగ్లర్లు అభ్యర్థులుగా మాకొద్దంటూ భారీఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత రామానుజం చలపతి మాట్లాడుతూ నగరిలో టీడీపీ కోసం కష్టపడిన వారికి విలువ లేదన్నారు. వారిని పక్కన పెట్టి అవినీతి అక్రమ సంపాదనల కోసం దొంగలకు, స్మగ్లర్లకు పదవులు ఇచ్చి నగరి సంపదను దోచుకుని తినే వ్యక్తిని అభ్యర్థిగా ఎన్నుకుంటే మేము ఓట్లు వేయాలా అంటూ ప్రశ్నించారు. వార్డు మాజీ కౌన్సిలర్ లత మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించిన బీసీ కులానికి చెందిన తెలుగు మహిళ అయిన తనను పలు విధాలుగా బాధపెట్టి అవమానించిన వ్యక్తికి ఓటు వేయమన్నారు. బీసీలకు టీడీపీలో విలువలేదన్నారు. తెలుగు మహిళలు అలిమేలు, రాధ, ఉమా, హేమ, కన్నెమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో మార్పులు

- ఎమ్మెల్యే అభ్యర్థుల నియామకంలో కొలిక్కిరాని అధిష్టానం
- కొత్తవారికే అవకాశం..
- డిప్యూటీ సీఎంకు నోఛాన్స్...?



గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణ

ప్రజాశక్తి- వెదురుకుప్పం

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల మార్పు ఉంటుందని ఆశావహులలో అలజడి మొదలైంది.. కథ మళ్ళీ మొదటికి వచ్చింది.. అభ్యర్థుల ఎంపిక నియామకంలో అధిష్టానం తర్జనభజన పడుతోంది... కొత్తవారికి అవకాశం ఇవ్వాలన్న ఆలోచనలో వైసిపి అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోందని ప్రచారం జోరుగా జరుగుతోంది. ఈసారి డిప్యూటి సిఎం నారాయణస్వామికి చాన్స్ లేనట్లే అని నియోజకవర్గంలో చర్చ మొదలయ్యింది....

గత నియోజకవర్గ పరిస్థితి ఇది...

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఆరు మండలాలు కార్వేటినగరం, శ్రీరంగరాజపురం, పాలసముద్రం, గంగాధర నెల్లూరు, పెనుమూరు, వెదురుకుప్పం మండలాలు ఉన్నాయి. 2014- 2019 ఎన్నికల్లో నారాయణస్వామి గెలిచారు. ఓసారి ఎమ్మెల్యేగా, రెండో సారి డిప్యూటీ సీఎంగా.. ఒక పర్యాయం నియోజకవర్గాన్నికి సేవలు అందించారు. ఆయనపై రానురాను వ్యతిరేకత పెరిగిందని నియోజకవర్గం అధికశాతం నాయకులు చెబుతున్నారు. మాజీ ఎంపీ ప్రభుత్వ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి ప్రత్యక్షంగా నారాయణస్వామి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ గ్రూపులు కడుతూ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తూ వస్తున్నారు. ఈవిషయమై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వద్ద నియోజకవర్గ అస్మతి నాయకులు ఆయన నివాసం దగ్గర గతంలో మొరపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో నారాయణస్వామికి, ఎంపీ రెడ్డప్పకు జీడీ నెల్లూరు అసెంబ్లీ టికెట్టు ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గతంలో ప్రకటించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామిని చిత్తూరు ఎంపీగా ప్రకటించారు. అయితే నియోజకవర్గంలో నాయకులు నారాయణస్వామి వర్గీయులు రెడ్డప్ప అభ్యర్థిని తిరస్కరించి అస్మతి ప్రకటించారు. దీంతో మళ్లీ నారాయణస్వామికి గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రకటిస్తూ వార్తలు చక్కర్లు కొట్టాయి. ఇదే సమయంలో నూక తోటి రాజేష్‌కు టికెట్ ఇప్పించాలని పెద్దిరెడ్డి ప్రయత్నాలు చేశారు.

కళత్తూరు నారాయణస్వామి

నారాయణస్వామి తిరుపతి ఎంపీగా పంపించాలని భావించారు. అయితే నారాయణస్వామి నేరుగా ముఖ్యమంత్రిని కలిసి పట్టుపట్టడంతో మళ్లీ గంగాధర నెల్లూరుకు టికెట్ ఇచ్చామని వార్తలు వచ్చాయి. దీంతో సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా నూకతోట రాజేష్‌ను ప్రకటించింది అధిష్టానం.

నారపల్లి పద్మజారెడ్డి

ప్రస్తుత పరిస్థితి...

మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణ 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం వైసీపీ టికెట్‌ను హరికృష్ణ ఆశిస్తున్నారని, తనకే గంగాధర నెల్లూరు టికెట్ అంటూ నియోజకవర్గంలో చర్చ మొదలయ్యింది. ఉన్నట్లుండి వైసిపి అధికార ప్రతినిధి నారపల్లి పద్మజారెడ్డి రంగప్రవేశం చేశారు. ఈమె మాజీ ఎంపీ శివప్రసాద్ చెల్లెలు. ఆమె జీడీ నెల్లూరు మండలానికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డిని వివాహం చేసుకుంది. గతంలో ఈమె కాంగ్రెస్ టికెట్‌ను ఆశించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆశీస్సులు మెండుగా ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ పై దాడి సరికాదు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సోమవారం ముఖ్యమంత్రి సభను కవర్ చేయడానికి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివపై వైసీపీ మూకలు దాడిని మన చిత్తూరు అభివద్ధి వేదిక కార్యదర్శి చైతన్య ఖడించారు. ఇటీవల విలేకరులపై జరుగుతున్న దాడులను అరికట్టడం జిల్లా కలెక్టర్ బాధ్యత అని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చైతన్య డిమాండ్ చేశారు.

పలమనేరు: కుప్పం నియోజకవర్గంలో జరిగిన సభలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడిన మాటలన్నీ అబద్దాలని, ప్రజలను మభ్యపెట్టేందుకు అబద్దాలు చెబుతున్నారని వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గతవారం రాప్తాడులో విలేకరిపై విచక్షణారహితంగా దాడి చేయడమే కాకుండా, ఈరోజు కుప్పంలో జగన్ సమక్షంలో ఆంధ్రజ్యోతి విలేఖరి శివపై దాడి చేయడం, కెమెరా లాక్కోవడం దారుణమన్నారు. ఈ విలేకరుల దాడులన్నీ జగన్‌కు తెలిసే జరుగుతున్నా పట్టించుకోకపోవడం చూస్తుంటే ప్రస్తుత ప్రభుత్వం పత్రికా రంగానికి ఏపాటి ప్రాధాన్యత ఇస్తాందో అర్థమవుతుందన్నారు. మీడియా ఫొటోగ్రాఫర్ శివపై వైసిపి నేతల దాడిని ఆయన ఖండించారు.

జీడీ నెల్లూరు ఎమ్మెల్యే టికెట్ రేసులో కొత్తపల్లి మనీ

- టికెట్ కోసం ప్రయత్నాలు
- సర్పంచ్‌గా, స్వచ్ఛంద సేవ ఆర్గనైజర్‌గా సేవలు
- రాజకీయ అనుభవం

ప్రజాశక్తి - వెదురుకుప్పం

గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించారు. ఎమ్మెల్యే టికెట్ రేసులో మాజీ సర్పంచ్, స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్గనైజర్ కొత్తపల్లి మనీ చురుగ్గా ఉన్నారు. ఒకప్పుడు వేపంజేరి నియోజకవర్గం పునర్ విభజన అనంతరం గంగాధర నెల్లూరు కొత్తగా ఏర్పడింది. ఈ నియోజకవర్గంలో వెదురుకుప్పం, కార్వేటినగరం, పాలసముద్రం, ఎస్ఆర్ పురం గంగాధర నెల్లూరు పెనుమూరు మండలాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గ ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించారు. అటు తెలుగుదేశం, పార్టీ జనసేన కాంగ్రెస్, బిజెపి ప్రధాన పార్టీలు, వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరితో పాటు తాను కూడా వైసిపి నుంచి టికెట్ ఆశిస్తున్నానని కొత్తపల్లి మణీ అన్నారు. ప్రజాశక్తి ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ....

బాల్యం...

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం కటికపల్లి గ్రామపంచాయతీ కటికపల్లి గ్రామంలో గోవిందమ్మ తంగవేలు దంపతులకు1.1.1968 సంవత్సరం జన్మించారు. ఇతను 49 కొత్తపల్లి మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ 1985 సంవత్సరం ఎస్‌పిఎల్‌గా ఎన్నుకొని విద్యార్థులకు సేవలు చేశారు. అప్పటినుంచి నాయకత్వ లక్షణాల ఉనికి చాటుకున్నారు.

రాజకీయ అనుభవం ఇలా....

ఇంటర్మీడియట్ స్థాయిలో చిత్తూరు కన్నన్ కాలేజీలో సాగింది. (1986- 87) సంవత్సరం విద్యార్థులచే నడపబడు సాంఘిక సంక్షేమ శాఖకు స్టూడెంట్ మేనేజ్మెంట్ మేనేజర్‌గా ఎన్నుకోబడి విద్యార్థులకు సేవలందించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నడుం చుట్టారు. కళాశాల జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1989 సంవత్సరంలో దేవలంపేట స్వచ్ఛంద సేవాసంస్థలో సోషల్ ఆర్గనైజర్‌గా వెనుకబడిన కులాల వారికి సేవలందించారు. ప్రస్తుత గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో బీసీ వెనుకబడిన తరగతులను కాకుండా అగ్రకులాల్లోనూ మనీ మంచి పట్టు సాధించారు. ఈ అనుభవంతోనే 1995 -2000 సంవత్సరంలో కటికపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గెలిచి ఆ పంచాయతీకి సేవచేసి మండల స్థాయిలోనే కాకుండా జిల్లాలోని కటికపల్లెను ఉత్తమ పంచాయతీగా అభివృద్ధి చేసి తీర్చిదిద్దినందుకు అప్పటి చిత్తూరు కలెక్టర్ నరసింహారావుచే అవార్డు తీసుకొని జిల్లా వాసులచే మన్ననలు పొందారు. 2004 సంవత్సరం డాక్టర్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం వెంట నడిచి ఆయన ఆశయసాధనకు అనుగుణంగా మండలంలో జిల్లాలో వైయస్సార్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలో ఇతను ముందు ఉండేవారు.

వైసిపి టికెట్ రేసులో... కొత్తపల్లి మణీ

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సిపి నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వారిలో మణీ పేరు వినిపిస్తుంది. స్వచ్ఛంద సేవాసంస్థలో ఆర్గనైజర్‌గా ప్రజలకు అందించిన సేవలను, నాటి పరిచయాలను వైయస్ మరణాంతరం నియోజకవర్గంలో ఓదార్పు యాత్రలో జగన్మోహన్ రెడ్డితోపాటు పాల్గొని, 14 నెలలు పాటు రాష్ట్రవ్యాప్తంగా 3648 కిలోమీటర్లు పాదయాత్ర చేసే సమయంలో మణీ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో పాటు పలు నియోజకవర్గాల్లో ఆయనతో పాటు నడిచారు. నియోజకవర్గంలో అందరి మన్ననలు తనకి ఉన్నాంయని ఆయన చెప్తున్నారు. ఎమ్మెల్యే టికెట్ తనకి వస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునే అవకాశం ఉంటుందని వారికి సేవ చేస్తానని తెలిపారు.

ఎమ్మెల్యే టికెట్ రాలేదు... నిరాశ చెందలేదు...

గంగాధర నెల్లూరు నియోజకవర్గంకు ఎమ్మెల్యే టికెట్ కోసం మూడు పర్యాయాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నా ...కానీ రాలేదు ...నిరాశ చెందలేదు. దృడవిశ్వాసంతో వైయస్సార్ పార్టీకి సేవకుడిగా పని చేస్తున్నాను. టికెట్ ఇస్తే లక్ష ఓట్ల పైనే మెజారిటీలో గెలిచి పార్టీకి సేవ చేస్తాను.

నియోజకవర్గానికి సేవ చేస్తా....

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాలలో బంధువులు స్నేహితులు తెలిసినవారు అధికసంఖ్యలో ఉన్నారు. తనకి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే గెలిచి తీరుతా నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవ చేస్తా అని ధీమా వ్యక్తం చేశారు.

టికెట్ ఇస్తే గెలిచి చూపిస్తా..

జీడీ నెల్లూరు వైసిపి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న కొత్తపల్లి మనీ

చిత్తూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి మనీ

చిత్తూరు అర్బన్: తనకు జీడీ నెల్లూరు టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిచి చూపిస్తానని జీడీ నెల్లూరు నియోజకవర్గం, ఎస్ఆర్ పురం మండలం కటికపల్లికి చెందిన కొత్తపల్లి మనీ పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తపల్లి మనీ మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. 25 సంవత్సరాలగా ప్రజాసేవలో ఉన్నానని, గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి తనకు జీడీ నెల్లూరు స్థానాన్ని ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో తనకు జీడీ నెల్లూరు అసెంబ్లీ టికెట్ ఇస్తే నియోజకవర్గంలో తనకున్న బంధువర్గం, ప్రజాభిమానంతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాను విద్యార్థి నాయకుడిగా కాంగ్రెస్ పార్టీ, వైసిపిలో ఉంటూ నియోజకవర్గంలో వైకాపా అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పార్టీ స్థాపించిన తర్వాత ఆ పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా ఉంటూ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా జనంలో ప్రచారం చేసి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చేసినట్లు చెప్పారు.

వైఎస్ఆర్ కిట్లు ఏవీ..?

- అంగన్వాడీలకు అందని జీతాలు
- సరుకులు గల్లంతు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

స్త్రీశిశు సంక్షేమశాఖ పరిరక్షణ, జీతాలు పెంపు ఇలా తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు 42 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా వీరోచిత పోరాటం చేశారు. వివిధ రూపాల్లో అంగన్వాడీల పోరాటం సాగించి ప్రభుత్వం ముందు 12 రకాల డిమాండ్లను ఉంచారు. ఇందులో 11 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. జీతాల పెంపు విషయం జూన్ నుండీ అమలు చేస్తామంటూ హామీ ఇచ్చింది. సమ్మె కాలం జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా రెండు నెలల పాటు జీతాలు అందక అంగన్వాడీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీల జీతాలు చెల్లించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించించాలని కోరుతున్నారు. మరో వైపు సమ్మె కాలంలో అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల్లో తేడాలున్నాయంటున్నారు. ఇదిలా ఉండగా జనవరి నుండీ స్త్రీశిశు సంక్షేమశాఖ ద్వారా సరఫరా చేసే బాలింతలు, గర్భవతులకు సరఫరా చేసే వైఎస్ఆర్ కిట్లు సరఫరా కావడం లేదంటున్నారు.

రెండు నెలలుగా అందని వైఎస్ఆర్ కిట్లు

స్త్రీ శిశు సంక్షేమశాఖ ద్వారా జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు వైఎస్ఆర్ కిట్లు పేరుతో ఒక్కోకిట్టులో రాగిపిండి, జోన్నపిండి, అటుకులు కేజీ చొప్పున, పావుకిలో చిక్కీ, బెల్లం, అర కిలో కర్జూరం సరఫరా చేస్తోంది. బలహీనంగా ఉన్న గర్భతులు, బాలింతల్లో రక్తహీనత తగ్గి బలం పెరిగేలా వైఎస్ఆర్ కిట్టు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లోని బాలింతలు, గర్భతులకు అందిస్తోంది. ఈ కిట్టులు గత ఏడాది డిసెంబర్ నెల వరకు వచ్చాయి. అంగన్వాడీలు సమ్మెలో ఉన్నప్పటి నుండీ వైఎస్ఆర్ కిట్లు అంగన్వాడీ కేంద్రాలకు జిల్లా వ్యాప్తంగా సరఫరా ఆపేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న గర్భిణీలు, బాలింతలకు వైఎస్ఆర్ కిట్లు అందడం లేదు. బియ్యం, పప్పు, గుడ్లు, పాలు మాత్రమే సరఫరా చేస్తున్నారు.

సరుకులు గల్లంతు

సమ్మె కాలంలో కొందరు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు గుట్టుచప్పుడు కాకుండా చేతివాటం ప్రదర్శించిన్నట్లు తెలుస్తోంది. అంగన్వాడీలు సమ్మెలో ఉంటే సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లోని లబ్దిదార్లకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. రికార్డుల్లో చూపకపోవడంతో ప్రస్తుతం అంగన్వాడీలకు తలనొప్పిగా మారిందంటున్నారు. టేక్‌హోం రేషన్ పేరుతో లబ్దిదార్లకు ఇండ్లకు అందించే పౌష్టికాహారం ఎంత మందికి అందించారనే లెక్కలు లేవు. ఫేస్ యాప్‌లో కూడా నమోదు చేయకపోడంతో స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు లెక్కల్లో తేడాలు బయటకు రాకుండా తొక్కిపెడుతున్నట్లు సమాచారం. అంగన్వాడీల సమ్మె కాలంలో సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో స్టాక్ వివరాలు తేలీక జిల్లాలోని అంగన్వాడీలు తలలు పట్టుకుంటున్నారు. గత డిసెంబర్ 12 నుండీ జనవరి 22వ తేదీ వరకు అంగన్వాడీల సమ్మె జరిగింది. సమ్మెను నీరుగార్చేలా ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ద్వారా బలవంతంగా అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగులగొట్టి తెరిపించింది. సరుకుల పంపిణీకి పూనుకుంది. ఈ సందర్భంలో అనేక మంది సచివాలయ ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించారు. ఫలితంగా నేడు లేక్కలో తేడాలోస్తున్నాయి.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- సోమల: మండలంలోని నంజంపేట గ్రామానికి చెందిన ముస్లిం యువత గత కొన్ని నెలలుగా పేద ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం గ్రామంలోని 12 నిరుపేద కుటుంబాల వారికి 11రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలం నుండి పేద ప్రజలకు నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తూ వస్తున్నామని ఇదే క్రమంలో సోమవారం 11 రకాల నిత్యావసర సరుకులను 12 కుటుంబాల వారికి ఉచితంగా అందజేయడం జరిగిందని తెలిపారు. అమ్ము, అక్బర్, అస్లాం, రిజ్వాన్, రఫీ, ఇర్ఫాన్, ఖాదరవల్లి తదితరులు పాల్గొన్నారు.

28న మండలంలో మంత్రి పర్యటన

ప్రజాశక్తి- సోమల: పుంగనూరు శాసనసభ్యులు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 28వ తేదీ బుధవారం సోమల మండలంలో పర్యటించి పలు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఐదు కోట్ల 75 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న మార్కెట్ యార్డ్, రూ.40 లక్షలతో నిర్మిస్తున్న ప్రయాణికుల బస్సు షెల్టర్ సముదాయం, ఆర్వో ప్లాంట్లు, సచివాలయ భవనాలు, సబ్‌స్టేషన్స్, షాదీ మహల్ ప్రారంభించనున్నారు. అలాగే సోమల బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న ప్రయాణికుల బస్సు స్టేషన్ కోసం సిమెంటు రోడ్ల నిర్మాణం, విద్యుత్ ఏర్పాట్లను ముమ్మరంగా కావిస్తున్నారు.

బలిజలకు తీరని అన్యాయం

గాంధీ విగ్రహం ఎదుట నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అసెంబ్లీ ఎన్నికల్లో బలిజలకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ బలిజలు రాజకీయ పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుండి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం ఎదుట అధికార ప్రతిపక్ష పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బలిజలకు సీట్లు కేటాయించకుండా వైసిపి, తెలుగుదేశం అన్యాయం చేసిందంటూ బలిజ సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బలిజలను గుర్తించాలని కోరుతూ నిరాహార దీక్షలకు పూనుకుంటామని హెచ్చరించారు. బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు ఓఎం రామదాసు, నాయకులు పూలచంద్ర, నందగోపాల్ పాల్గొన్నారు.

జిసిటిఏ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిసిటిఏ డైరీని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామర్స్ విభాగ అధ్యాపకులు డాక్టర్ కె.శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో జిసిటిఏ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎస్‌కె.రుష్మ, డాక్టర్ సి.మంగళగౌరి, డాక్టర్ కెల్ఎండి.బక్షు, బిఎం. ఇస్మాయిల్, నాగేశ్వరరావు, టి.నరేంద్రబాబు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలో 25శాతం రిజర్వేషన్ కల్పించాలి

ఎంఈఓ నాగేశ్వరరావు

ప్రజాశక్తి- బంగారుపాల్యం: ప్రైవేట్ పాఠశాలలో 25శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. రాబోవు విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాల చేరే విద్యార్థులు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని, మార్చి 14వ తారీకు నమోద ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. అనాధ పిల్లలు, హెచ్ఐవి సోకిన బాధితులు, దివ్యాంగులు, ఎస్సీలు, ఎస్టీలు ఇతర అవసరాల గల పిల్లలకు 25 శాతం పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, వీరికి ఉచితంగా ప్రైవేట్ పాఠశాలల్లో విద్య అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. అవసరమైన వారు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, చివరి తేదీ మార్చి 14వ తారీకు ముగిస్తుందన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నగరి రూరల్ మండలం మేళపట్టు అంబేద్కర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ అండ్ వాలీబాల్ టోర్నమెంట్‌ను సోమవారం నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తిరుమలలో అనర్హులకు అందలం

డబ్బున్నోడికి పాపనాశనంలో షాపులు
మంత్రి ఆదేశాలతో అటవీశాఖ అత్యుత్సాహం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వడ్డించేవాడు మనోడైతే ఏ బంతిలో కూర్చున్నా ఇబ్బంది లేదన్నట్లుగా 'పక్కా కమర్షియల్'గా మారిపోయింది తిరుమల తిరుపతి దేవస్థానం. తిరుమల పాపనాశనంలో అనర్హులను అందలమెక్కించారు. సాధారణంగా తిరుమల నమ్ముకున్న స్థానిక పేదలకే షాపులు ఇవ్వాల్సి ఉంది. అయితే అటవీ శాఖ ఒక్కొక్కరి దగ్గర ఐదు లక్షలు లంచం తీసుకుని షాపులకు నవంబర్‌లో లైసెన్స్‌లు ఇచ్చేశారు. తిరుమల తిరుపతి వాసులకు కాకుండా పీలేరు, మదనపల్లి, పుంగనూరు ప్రాంతాలకు చెందిన రాజకీయ పలుకుబడి ఉన్న వారికే షాపులు కేటాయించడం గమనార్హం. అయితే జిల్లాలో కీలకమైన ఓ మంత్రి ఆదేశాల మేరకే ఫారెస్టు అధికారులు పాపనాశనం వద్ద 30-40 మందికి అధికారికంగా లైసెన్స్‌లను ఇచ్చేశారు. వారిలో థమ్సప్, కోకోకోలా, మాజీ, కిన్లే, కురకురే, లేస్ ఏజెంట్లయిన సుబ్రమణ్యం, రమణలకు అధికంగా షాపులు కేటాయించారు. ఇదేమని ప్రశ్నిస్తే 'మా ఇష్టం' అన్నట్లుగా అటవీ అధికారుల తీరు ఉంది.

గతంలో శ్రీవారికి 'సంరక్షకులు'గా అటవీ ప్రాంతంలో కొంతమందిని తిరుపతి నుంచి తిరుమలకు తీసుకెళ్లింది. అక్కడే కాపురాలు ఉండేలా చేసి అంగళ్లను కేటాయించారు. స్థానికులకే పెద్దపీట వేస్తూ తిరుమల, ఆకాశగంగ, వేణుగోపాలస్వామి గుడి, అలిపిరి పాదాల మండపం, పాపనాశనం, శిలాతోరణం ప్రాంతాల్లో టిటిడినే వీరికి ఉచితంగా లైసెన్స్‌లు ఇచ్చి తిరుమల అభివృద్ధిలో భాగస్వాములను చేసింది. ఇది ఆనవాయితీగా కొనసాగుతూ వంశపారపర్యంగా వర్తింపజేసింది. తిరుమల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యాత్రాస్థలం కావడం, కోట్లాది రూపాయలు సమకూరుతుండడంతో తిరుమలలో వ్యాపారానికి గిరాకీ పెరిగింది. హోటళ్లు, బజ్జీలు, టీ అంగళ్లు, టోపీలు, బొమ్మలు, గిల్ట్ నగలు, శ్రీవారి చిత్రపటాలు, ఫొటోస్టూడియోలు, టిఫిన్ అంగళ్లు స్థానికులకే అప్పగించారు. రోజువారీ ఆదాయం వేలల్లో ఉండడంతో తిరుమలలో ఒక్క షాపు సంపాదించుకుంటే నెలకు నాలుగైదు లక్షల సంపాదన వచ్చే స్థాయికి పెరిగింది. దీంతో రాజకీయ నాయకుల కన్ను పడింది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ అనుచరులు బినామీ పేర్లతో షాపులు పెట్టుకుంటూ అసలైన లబ్దిదారులను పక్కకు నెట్టేశారు. పాపనాశనం వద్ద ఎపి పరిధిలో ఉన్న ఫారెస్టు శాఖ పరిధిలో 40 షాపుల సంఖ్యను పెంచారు. కొత్త షాపుల్లో ఒక్కరు కూడా స్థానికులు లేరు అందరూ పీలేరు, మదనపల్లి, పుంగనూరు నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ అనుచరులే ఉన్నారు. జిల్లాలో కీలకమైన మంత్రి అదే శాఖలో ఉండడంతో వీరి పని సునాయాసం అయ్యింది. వారికి సంబంధించిన వారికి గత ఏడాది నవంబర్ 6న రేంజర్ స్థాయిలో షాపులు ఇస్తున్నట్లు కలెక్టర్‌కు నివేదికలు పంపారు. ఈ మేరకు కలెక్టర్ ఓకే చేశారు. స్థానికేతరులకు ఇస్తారేమని స్థానికులు ప్రశ్నించగా ఒక్క షాపుకు ఐదు లక్షలు ఇచ్చి కొనుగోలు చేశామని, తమ ఇష్టమని ఎదురు దాడికి దిగారు. బ్యాగ్రౌండ్ మంత్రే కీలకంగా ఉండడంతో స్థానికులు ఏం చేయలేక వెనకడుగు వేసి మిన్నకుండిపోవడం గమనార్హం.

ఘనంగా స్విమ్స్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) 31 వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్విమ్స్‌ను దేశం లోనే అత్యున్నత వైద్య సంస్థగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతాం అన్నారు. స్విమ్స్ వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు అనన్య సామాన్యమైనవని, వైద్య వత్తిలో వారి జీవన అవసరాలకు మించి సంపాదించే శక్తి, సామర్థ్యాలు ఉన్నప్పటికీ, సేవే పరిమావధిగా వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు కూడా సంపాదనే ధ్యేయంగా కాకుండా సమాజ హితం కోసం సేవలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. తిరుపతి నగర్ మేయర్ డాక్టర్ శిరీష, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఏఆర్ కుమార్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని

కల్యాణ కట్ట క్షురకుల ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: టిటిడి కల్యాణకట్టలో పనిచేస్తున్న క్షురకులకు జీతాలు పెంచాలని, అక్రమంగా తొలగించిన తొమ్మిది మందిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ టిటిడి పరిపాలనా భవనం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, టిటిడి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.సుబ్రమణ్యం మాట్లాడుతూ టిటిడి పాలకమండలి సమావేశంలో కార్పొరేషన్‌లో కలవని క్షురకులందరికీ 20వేలు వేతనం పెంచారన్నారు. జీతాలు పెంచినందుకు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి సిఐటియు తరపున ధన్యవాదాలు తెలిపారు. తొలగించిన తొమ్మిది మందినీ విధుల్లోకి తీసుకుంటామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళికి భూమన కరుణాకర్‌రెడ్డి ఫోన్ ద్వారా తెలిపారన్నారు. టిటిడి పాలకమండలి సభ్యులు యానాదయ్య కల్యాణకట్టలో పనిచేస్తున్న బార్బర్లను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సిఐటియు నాయకులు పి ముని రాజా, డి పార్థసారధి రెడ్డి, ఎం గంగులప్పా, ఎస్.రఘు, నాయకులు శ్రీహరి, ప్రసాదుపాల్గొన్నారు.

పౌరుషానికి పెట్టింది పేరు వన్నియకుల క్షత్రియులు

వైసిపి అభ్యర్థి విజయానందరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

కాయకష్టానికైనా, పౌరుషానికైనా పెట్టింది పేరు వన్నియకుల క్షత్రియులని, చిత్తూరు నియోజకవర్గంలో అధికారపీఠంలో ఎక్కించాలన్నా, అధఃపాతాళానికి తొక్కాలన్నా వాకి పాత్రే కీలకమని వైసిపీ అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. అలాంటి మాట తప్పని మడమ తిప్పని వన్నియకుల క్షత్రియులు తనను నమ్మి తనకు సంపూర్ణ మద్దతు తెలపడం తనపై మరింత భాద్యత పెంచిందని ఆయన అన్నారు. చిత్తూరు డిఐ రోడ్డులో నిర్వహించిన ఆ సామాజికవర్గ ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తిరుమల బేకరి అధినేత, పారిశ్రామిక వేత్త కన్నన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగరంలోని వన్నియర్ సామాజికవర్గ నాయకులు , కార్పొరేటర్లు, ప్రజలు, పాల్గొన్నారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో వన్నియర్ కులస్థులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది జగన్ మోహన్ రెడ్డిగారే అని కొనియాడారు. అంతే కాకుండా ఈ సామాజికవర్గ ప్రతినిధిని పెద్దలసభ రాజ్యసభకు పంపిన ఘనత కూడా జగనన్నకే దక్కుతుందన్నారు. తనకు మద్దతు తెలిపిన వన్నియకుల సామాజిక వర్గ అభ్యున్నతికి కట్టుబడి ఉంటానన్నారు. తనపై పెట్టిన నమ్మకాన్ని నూటికి నూరు శాతం కాపాడుకుంటానన్నారు. డిప్యూటి మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ రెడ్డి, కార్పొరేటర్లు గణేష్, వెంకట్, శశి, వేదా, సంఘ నాయకులు కట్టమంచి కుమార్, పిచ్చాండీ, ఏఎల్ఎస్ ఆరుముగం, అన్నామలై నాయకర్ పాల్గొన్నారు.

వన్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

అందరి సహకారంతో టిడిపి విజయం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గురుజాల జగన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు అసెంబ్లీ నుండీ తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసేందుకు ఆరుగురు ప్రయత్నించినా తెలుగుదేశం చిత్తూరు అభ్యర్థిగా తనను ఖరారు చేసినా తెలుగుదేశం పార్టీలోని అందర్నీ కలుపుకొని విజయం కోసం కృషి చేయనున్నట్లు గురుజాల జగన్మోన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం టిడిపి బిసి నాయకులు రాజన్, మాజీ మేయర్ కఠారి హేమలతలను వారి స్వగృహంలో కలుసుకొని రాష్ట్రంలో తెలుగుదేశం విజయం కోసం సమిష్టిగా కృషి చేయాలని కోరారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాడున్ని చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కలసి కృషి చేయాల్సిన అవసరముందని ప్రతి ఒక్కర్ని కలుపుకుపోయి చిత్తూరు అసెంబ్లిలో విజయం సాధించనున్నట్లు తెలిపారు.

'కార్మికులపై వేధింపులు మానుకోవాలి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థలోనీ పారిశుధ్యం విభాగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల చేత డంపింగ్ బిన్‌బాక్స్‌లో ఉన్నటువంటి చెత్తాచెదారాన్ని కింద కుమ్మరించి సెగ్రికేషన్ చేయడానికి వ్యతిరేకిస్తూ సోమవారం చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయం ముందు పారిశుద్ధ్యం కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో సెగ్రికేషన్ చేపట్టకపోయినా చిత్తూరు నగరపాలక సంస్థలో మాత్రం సెగ్రికేషన్ పేరుతో అధికారులు వేధించడం శోచనీయమన్నారు. ఆ చెత్తాచెదారంలో ఉన్నటువంటి సూదులు, బ్లేడ్లు, సీసా పెంకులు చేతులకు గుచ్చుకొని రక్తగాయాలై ఇన్ఫెక్షన్ వల్ల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారులు కార్మికులను వేధించడం సరికాదన్నారు. గత నాలుగు సంవత్సరాలగా పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫారం, చెప్పులు, సోపులు, నూనె ఇవ్వడంలో లేని శ్రద్ధ సెగ్రికేషన్ చేయించడంలో చూపడం ధర్మమా అని ప్రశ్నించారు. పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య కార్మికులను వేధించడమే కాకుండా పని నుండి నిలిపివేస్తామని బెదిరించడం, కార్మికుల మధ్యలో విభేదాలు సృష్టించి గొడవలు పెడుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని అనేక సార్లు చెప్పినప్పటికీ ఆయన పద్ధతి మార్చుకోలేదని అన్నారు. ఇదే ఇలాగే కొనసాగితే కార్మికులతో కలిసి పెద్దఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

టిటిడి ఉద్యోగ కార్మికులకు రూ.10కే భోజనం

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంపు
టిటిడి పాలకమండలి కీలక నిర్ణయాలు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం క్యాంటీన్‌లో పర్మినెంట్ ఉద్యోగులకే కాకుండా, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ రూ.10కే భోజనం అందించేందుకు పాలకమండలి తీర్మానం చేసింది. అలాగే టిటిడిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 9వేల మంది సొసైటీ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచుతున్నట్లు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. సీఎం జగన్, టీటీడీపై విమర్శలు చేసిన రమణ దీక్షితులను గౌరవ ప్రధాన అర్చకుని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగింది. ఇక నుంచి ప్రతి ఏటా ఫిబ్రవరి 24న తిరుపతి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రూ.4 కోట్లతో మంగళసూత్రాల తయారీ

నడకదారిలో గాలిగోపురం, ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిత్య సంకీర్తన అర్చన కార్యక్రమాలు నిర్వహించాలని టీటీడీ పాలక మండలి నిర్ణయించింది. తాళ్లపాకలో అన్నమయ్య కళామందిరం నిర్మాణం చేపట్టనున్నారు. తిరుమల పెద్ద జీయర్‌స్వామి అనుమతితో ద్వారపాలకులు జయవిజయలకు బంగారు తాపడం చేయాలని పాలకమండలి నిర్ణయించింది. రూ.4 కోట్లతో మంగళసూత్రల తయారీకి నాలుగు ప్రముఖ బంగారు వ్యాపార సంస్థలకు టెండర్లకు అప్పగించనున్నారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి విద్యుత్ అలంకరణలకు బోర్డు ఆమోదం తెలిపింది. కార్పొరేషన్‌లోని అటవీశాఖ కార్మికులను తిరిగి సొసైటీలో చేర్చి జీతాలు పెంచాలని నిర్ణయించారు. పాదిరేడులోని ఉద్యోగుల ఇంటి స్థలాల లేఅవుట్ అభివద్ధికి రూ.8.16 కోట్లు తుడాకు చెల్లించాలని నిర్ణయించారు. రూ.3.15 కోట్లతో తిరుమలలో పలుచోట్ల కొత్త మోటార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నారు. తిరుమలలో ఎఫ్.ఎం.ఎస్ సేవలకు మరో మూడేళ్లు పొడిగించాలని నిర్ణయించారు.

> **టీటీడీలో వేతనాల పెంపుపై సిఐటియు హర్షం**
>
> తిరుమల తిరుపతి దేవస్థానంలో ఏళ్ల తరబడి విధులు నిర్వర్తిస్తూ తీవ్ర వివక్షకు గురవుతున్న వేలాదిమంది కార్మికులకు టీటీడీ పాలకమండలి వేతనాలు పెంచడం పట్ల సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి తాము పలుమార్లు చేసిన విజ్ఞప్తిని దష్టిలో ఉంచుకొని సానుకూల నిర్ణయం చేసినందుకు అభినందనలు తెలియజేశారు. టిటిడి క్యాంటీన్లులో పర్మినెంట్ ఉద్యోగులకే నన్న భావన తొలగించి కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, ఎఫ్ఎంఎస్ కార్మికులకూ భోజన వసతి కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇదే తరహాలో బ్రహ్మోత్సవ బహుమానాన్ని అందరినీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగులకు, కార్మికులకు రూ.10కే భోజనం

గోవిందరాజస్వామి ఆలయంలో ఉత్సవవిగ్రహాలకు బంగారుపూత, అలిపిరి, గాలిగోపురం, లక్ష్మీనరసింహస్వామి వద్ద ఉన్న నీటి బావులు ఆధునికీకరణకు బోర్డు అనుమతి తెలిపారు. శ్రీలంకలో శ్రీవారి కల్యాణం నిర్వహించాలని పాలక మండలి నిర్ణయించింది. పెద్ద సంఖ్యలో లడ్డు తయారికీ సూపర్వైజర్ పోస్టుల కోసం ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు. పాపనాశానం వద్ద 682 మోటర్ పంపు సెట్లకు రూ.3.18 కోట్లు కేటాయించనున్నారు.1700 సంవత్సరాల చరిత్ర ఉన్న తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయానికి రూ.50 లక్షలు మంజూరు చేయాలని టీటీడీ బోర్డు నిర్ణయించింది. అలిపిరి , గాలిగోపురం నరసింహ స్వామి ఆలయం వద్ద ఉన్న ముగ్గు బావి ఆధునీకరణ చేపట్టాలని బోర్డు నిర్ణయించింది. ఉద్యోగులకు హెచ్ఆర్ఏ పెంపునకు నిర్ణయం తీసుకుంది. స్విమ్స్‌లో ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి ఉచిత వైద్యం అందించాలని పాలక మండలి నిర్ణయించింది. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు క్యాంటీన్‌లో రూ.10కే భోజనం అందించాలని నిర్ణయించింది.

వ్యవసాయ వర్సిటీ ఒప్పంద సేవకుల వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఒప్పంద సేవలుగా పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనం పెంచాలని కోరుతూ అగ్రికల్చర్ కళాశాల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు ఆధ్వర్యంలో డి.ఆర్.ఓకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ జయ చంద్ర, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి సాయి లక్ష్మి, అప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని గత నాలుగు సంవత్సరాల నుంచి పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. యూనివర్సిటీ యాజమాన్యం వారి జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. కాంట్రాక్టు లేబర్‌కు ఏడాదంతా పని చూపించాలని డిమాండ్ చేశారు. వరలక్ష్మి , చంద్రమ్మ సుబ్బు ముని లక్ష్మి, రాధా ,గిరిరేవతి, నాగరాజు ,నవీన్, చక్రి పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The general public are hereby informed that Sri Yandamuri Nagendra Babu S/o Late Y.Sathya Narayana has approached M/s Shriram Finance Ltd Himayatnagar Branch Hyderabad for depositing her title deeds under Sale Deed Doc No.2316 of 2013 Dt 13-06-2013 by way of equitable mortgage in respect of schedule property for securing her future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within (7) Seven days from today, failing which the loan amount will be sanctioned to Sri Yandamuri Nagendra Babu S/o Late Y.Sathya Narayana and no claim or no objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.

SCHEDULE OF THE PROPERTY

All that the part and parcel of Vacant site admeasuring Ac 00-10 cents equivalent to 484 sq.yds out of total land admeasuring Ac 00-82 Cents in Sy No. 1-4, 1-4A, 1-4B, 1-4C and 1-4D Situated at Chandragiri (Village & GP), Chandragiri (Mandal), Chittoor District, Andhra Pradesh State, and Bounded as Follows:-

North Land of Padiri Govindamma
South Plots in Swarnamukhi Nagar Layout
East Land in Sy No. 1/5 of C.Ramesh Reddy
West Site of Y.Rani Prameela

For NomosVistas, The Lawyers,
Govardhan Venu,
Advocate & CEO
C-701 Skyline & Sterling Residency,
Basheerbagh, Hyderabad 29.
Mob:-9849091266